# స్నేహం

రాత్రి భోజనాలైనాయి. నేనూ, ప్రభావతీ డాబా మీదికి చేరేము. శైలజ ఏదో పత్రిక తిరగేస్తోంది. రవీ, రామం నిద్రపోతున్నారు.

దశమి వెన్నెల కాస్తోంది. సప్తర్షి మండలం పడమట కేసి వాలిపోయింది. అరుంధతీ నక్షత్రాన్ని చూశాను. మనస్సు పెళ్ళి సంగతుల్ని నెమరు వేసుకోసాగింది.

శైలజకి పెళ్ళి చేయాలి. సంబంధం గురించి వెతుక్కోవలసినపని లేదు. శేషగిరి కొడుక్కూ-శైలజకీ చిన్నప్పుడే ముడిపెట్టి కూర్చుంది ప్రభావతి.

శేషగిరి నాకు బావమరిది. ప్రభావతికి అన్న.

ప్రభ వైపు చూశాను.

అన్నగారు రాసిన ఉత్తరాన్ని మరో మారు చదువు కుంటోంది. ఆమె మొహంలో విచారమూ, కోపమూ, కసి, ఉడుకు మోత్తనమూ, నిస్సహాయతా అన్నీ కొట్టవచ్చినట్టు కనిపిస్తునే వున్నయ్. నెత్తిన నీళ్ళకుండ ఏ క్షణాన్నయినా జలజలా దూకే లక్షణాలు కనిపిస్తూన్నాయి.

నేను లేచి పిట్టగోడ దాకా నడిచేను.

తనామనా లేకుండా ఇంత విక్కచ్చిగా అడుగుతాడనుకోలేదు. నేను, ఎంత ఆఫీసరు ఉద్యోగం చేస్తుంటే మటుకు మరీ ఇంత దారుణమా! ఏకంగా ఇరవై వేలు కావాలిట."

నేనేమీ మాట్లాడలేదు.

"పెళ్ళి చేసి పంపిన తరువాత పసుపు కుంకుమ కోసమన్నా ఏ నాడూ వాడి కొంపకు పోలేదు. నోరు తెరిచి అడిగాము కదా అని ఇంత దోపిడీనా."

ఆ తర్వాత ప్రభావతి పుట్టింటి వాళ్ళమీద తన అక్కసునంతా చాలా వివరంగానే వెళ్ళబోసుకుంది. శైలజకి తల్లి మాటలు కొంత ఇరకాటంగా తయారైనాయల్లే ఉంది. పుస్తకం మూసి, లైటు తీసేసి పడుకుంది.

"పొద్దుటనించీ నేను వాగడమేగానీ, మీ ఉద్దేశ్యం చెప్పరేం? ఏం చేద్దామంటారు" అడిగింది.

నేను ప్రభావతి కళ్ళలోకి చూసేను. కూతురి భవిష్యత్తుని గురించిన ఆందోళనని చదువుకున్నాను.

"శేషగిరి ఇరవై వేలు కట్నం అడగడంలో తప్పులేదు, ప్రభా! అది అతని అవకాశం. మనం శైలజని వాళ్ళింటి కోడల్నే చేయదలుచుకుంటే—ఆ ఇరవై వేలు ఇచ్చేందుకు ఇరవు చూసుకోవాలి, అంతే."

"శ్రీధర్‌కి మన పిల్లనివ్వడం మాత్రం నా లక్ష్యం" దృఢంగా అంది.

"అలాగయితే పెళ్ళి ఖాయం చేద్దాం. పడుకో" అన్నాను.

"మరి అంత కట్నం డబ్బు?" ప్రశ్నించింది.

"ఆలోచిద్దాం" అంటూ మంచం మీద పడుకున్నాను.

రఘుపతీ, ప్రకాశం నా కళ్ళముందు మెదిలేరు. కాలంలో వెనక్క-

నడవసాగింది మనస్సు.

రఘుపతీ, నేనూ బాల్యస్నేహితులం. అతను మా ఇంటి ఎదురుగా వుండేవాడు. బక్కపల్చగా, పొడుగాటి వెంట్రుకలతో, బలహీనంగా కని పించే కాళ్ళూ, చేతులతో గడకర్రలా వుండేవాడు. టెలిఫోన్ పోస్ట్ అని కొంత మంది వాడికి నిక్‌నేమ్ కూడా తగిలించారు. రఘు తల్లి తండ్రులు చిన్నతనంలోనే పోయారు. బాబాయి పోషణలో పెరిగాడు. యస్సెల్సీ అయిన తర్వాత వాడూ నేనూ గుంటూరు కాలేజీలో చేరేము. సరిగ్గా ఆ ఏడే వాళ్ళ బాబాయి పోయాడు. మేమిద్దరమూ కొత్తపేటలో ఒక గది తీసుకుని వుండే వాళ్ళం. స్వయం పాకం. మేము అద్దెకున్న ఇంటి యజ మాని పెద్ద కలప వ్యాపారస్తుడు. వాళ్ళ గారాల కూచి ఏకైక బిడ్డ ప్రకా శం కూడా ఆ ఏడే మా కాలేజీలో చేరేడు.

రఘుపతి జనంతో కలిసే వాడుకాదు. అందర్నీ తప్పుకుని తప్పు కుని తిరుగుతూ వుండేవాడు. అతను ఆ రోజుల్లో ఒకే జత గుడ్డల్తోగడిపే వాడు. ఖద్దరుపై జామా లాల్చి. వాటిని రాత్రిపూట ఉతుక్కుని, చెంబు ఇస్త్రీ చేసుకునేవాడు. తీరిక సమయంలో ఆ పనీ, ఈ పనీ చేసి జీవించడం అలవాటు చేసుకున్నాడు రఘుపతి. ఒకసారి ఒక స్థానిక పత్రిక ఆఫీసులో చూసాన్నేను. ఆ రాత్రి టీ తాగి తిరిగి వస్తుంటే కనబడ్డాడు. నన్ను చూసి కొంచెం కలవర పడ్డాడు. "నువ్వెట్లా వచ్చావిక్కడికి ?" అని మాత్రం అడిగాడు. ఆ తర్వాత తెలిసింది. రాత్రల్లా అక్కడ ప్రూఫులు చూస్తే రోజుకు రూపాయి యిచ్చే వాళ్ళని.

అమ్మకి ఒంట్లో బాగా లేదని పుత్తరం వచ్చింది ఓ రోజు. ఆవేళ మనసు బాగాలేదు. సాయంత్రం ఆరుగంటలవుతోంది. గాంధీ పార్కుకు వెళ్ళి ఓ మూల కూర్చున్నాను. జనం పల్చగా వున్నారు. కనిచీకటి పడు

తోంది. వేరుశనక్కాయలు అమ్ముకునే అతను నాదగ్గరగావచ్చి 'శనక్కాయలు, శనక్కాయలు' అంటున్నాడు. అదాటున చూసి ఉలిక్కి పడ్డాను. రఘుపతి!!

రఘుపతి చెయ్యిపట్టుకుని కూర్చోబెట్టాను. అతన్ని తీవ్రంగా చూశాను. నా చూపులో అనేకానేక అర్థాలున్నాయి. ప్రశ్నలున్నాయి. సందేహాలున్నాయి.

క్షణాల తర్వాత సన్నగా అన్నాడు రఘుపతి. "నాకు అందమైన కలలు రావు మూర్తీ. ఆకాశంలో ఎగరనూ లేను నేను. నా బలహీనత-పేదరికం. దాన్ని నేను మరచిపోయి బతకలేను. కనీసం పాసిపోయిన అన్నం నా మనసుకు ధైర్యం. నన్నిలా సాగిపోనీ. నెలాఖరుకుమన ఖర్చులో ఒక సగాన్ని అమావాస్య చంద్రుణ్ణి చెయ్యడం నా కిష్టం లేదు. నా ఉనికీ ప్రవర్తనా నీకేమన్నా న్యూనతని కలిగిస్తుంటే చెప్పు నిన్ను ఇబ్బంది పెట్టను"

నా కళ్ళలో నీళ్ళు తిరిగినై. మాటలు గద్గదికమైనై "తమ్ముడూ" అన్నాను. హృదయతంత్రి చేసిన స్వరమేళన అది.

ప్రకాశంతో పరిచయం పెరిగి, సాన్నిహిత్యంగా మారింది.

ముగ్గురమూ కలిసి జట్టుగా తిరుగుతున్నా, కాలేజీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నా, రఘుపతి మాత్రం ప్రకాశంతో పూర్తిగా కలిసిపోలేదు. నేనూ ప్రకాశం మాత్రం. 'ఇన్సెపరబుల్' అయిపోయాము.

ప్రకాశంది భారమైన శరీరం. పెరుగుతున్న బొర్ర. ఉప్పు కుండ మీద పిడతను పెట్టినట్టు తలకాయ, అయితే అతనిలో ఠీవి వుండేది. సూటూ, బూటూ నిగనిగ మెరిసి పోతూవుండేవి. మొత్తం మీద తళతళ మెరిసే బంగారు ముద్దలా వుండేవాడు. మాటల్లో చాలా ఛలాకీతనం, ప్రవర్తనలో 'స్పీడు'-కొట్టొచ్చినట్టు కనిపించేవి. వాళ్ళ నాయనమ్మ అంటూ

వుండేది-'మా ప్రకాశంగాడు చెళ్ళపిళ్ళ రాముడు' అని.

కాలేజీలో అన్ని వ్యవహారాల్లోనూ ప్రకాశం పేరే ప్రముఖంగా వినిపించేది. అనేక సంఘాలకి అతనే కార్యదర్శిగా వుండేవాడు.

ఒకరోజు రాత్రి నేనేదో చదువుకుంటున్నాను. బుగ్గన కిళ్ళీనములు కుంటూ వచ్చాడు ప్రకాశం మా గదిలోకి-

క్షణాల తర్వాత చూసేడు "మా త్రీ-కాలేజీ మేగజైన్‌లో నా 'ఆర్టి కల్' ఉండాల్సిందేనని అంతా పట్టుబడుతున్నారు, ప్రిన్సిపాల్‌తో సహా. అందుకని ఏదైనా సరే-వోనాలుగు పేజీల మేటర్ రాసివ్వు"

రఘుపతి అదోలా ప్రకాశంకేసి చూసాడు. "సొమ్మొకడిది సోకొ కడిదీ నన్నమాట" అన్నాడు.

ప్రకాశంకి కోపమొచ్చిందనుకున్నాను. అతనన్నాడు "రఘూ రాసేది వాడు-తీసుకునేది నేను-నీకెందుకు"

ఆ విషయం మీద ఎక్కువగా సాగకుండానే ఆగిపోయింది సంభాషణ. ప్రకాశం చెప్పి వెళ్ళిపోయాడు. నేను ఏదో వ్రాసి వచ్చాను. రఘు తీవ్రంగా నా చర్యని ఖండించాడు.

ఇంటర్ రెండో సంవత్సరం జరుగుతోంది.

ఆ వేళ కాస్త ఆలశ్యంగా గదికి వచ్చాను.

కుర్చీ అంచుకు తల ఆనించి కప్పుకేసి చూస్తూ చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు రఘుపతి.

నన్ను చూస్తూనే ఒంటికాలి మీద లేచాడు. "సీతా సావిత్రులలా మరి యమ్మలంటే మీకు అసహ్యం కావచ్చు. కానీ నాకు వాళ్ళంటే చాలా గౌరవం. ప్రకాశం చేసిన పనికి తలనేల వాల్చుకుని పాతాళంలోకి పారి పోవాల్సిందిపోయి, మగసిరికి అదేదో తార్కాణంగా స్కూటర్ల మీద తిరగడం నాకు నచ్చలేదు. నువ్ దీన్ని హర్షించడం నాకు అస్సలేగిట్టని

సంగతి. అతను మాట్లాడే అంశం అర్థమయింది నాకు. ప్రకాశంకాలేజీలో తనతో చదివే రాజ్యలక్ష్మి ప్రేమలో బడ్డాడు. ఈ మధ్య వారాంతంలో వాళ్ళిద్దరూ హైదరాబాద్‌లో గడిపి వచ్చేరని కాలేజి అంతా గుప్పుమంది. ఆ పిల్ల తండ్రి-ప్రకాశంని తప్పుపట్టి మందలించాడు. దానికి ప్రతిగాప్రకాశం-ఆ పిల్లే తనని పోరుపెట్టి హైదరాబాద్ తీసుకుపోయిందని తెగేసి చెప్పేడు. రాజ్యలక్ష్మేమో "అబద్ధం" అంటూ ఏడుస్తూ కూర్చుంది. కాలేజీ స్టూడెంట్స్ అందరికీ ఇది పెద్ద చర్చనీయాంశంగా తయారైంది.

"ప్రకాశంకి నేనే చెద్దామనుకుంటున్నాను" అన్నాడు రఘుపతి-శూన్యంలోకి చూస్తూ, నాకు అవకాశం ఇవ్వకుండా.

మాటల్లోనే ప్రకాశమూ వచ్చాడు. రఘుచాలా సీరియస్‌గాచెప్పేడు, "ఆడపిల్లల మనసుతో మాత్రం ఆడుకోకు ప్రకాశం. నువ్ చేసిన పనికి సిగ్గుపడి, ఆమెకి క్షమాపణ చెప్పు-మిత్రుడిగా నాకు నీ ప్రవర్తన చాలా 'ఇన్‌సల్టింగా' వుంది."

ప్రకాశంకి కోపం వచ్చింది. వాదనలోకి దిగేడు. చివరికి అన్నాడు, "ఉచ్చగుంటలో చేపలు బట్టే నీలాంటి వాళ్ళకి అలాగే వుంటుంది. నువ్ నా మిత్రుడివని చెప్పుకోవడం నాకు 'ఇన్‌సల్టింగ్'గానే వుంది."

నిదానం మీద ప్రకాశంకి నచ్చచెబుదామనుకున్న నా ఆలోచన ఆలోచనలోనే వుండగానే తాడు తెగనే తెగింది. నేను శ్రోతగా, ప్రేక్షకుడుగా మిగిలిపోయాను.

రెండు రోజుల తర్వాత-

రఘుపతి గది ఖాళీచేసి వెళ్ళిపోయాడు. నా గుండె అరలో ఒక శూన్యత ఆవరించింది. వెళ్తూ వెళ్తూ చిన్న 'స్లిప్' ఇచ్చి వెళ్ళాడు. "నా నిర్ణయానికి నువ్వూ, ప్రకాశమూ కారణము కానే కాదు. బాధపడకు. నేను చదువు మానేసి ఉద్యోగం వేటలో పడుతున్నాను. ఆ తర్వాత కలుస్తాను.

ఆ ఏడే నేను సరదాగా సర్వీస్ కమీషన్ పరీక్ష రాశాను. ఉద్యోగం వచ్చింది. పరిశ్రమల శాఖలో గుమాస్తాగా విజయవాడలో చేరేను.

పెళ్ళి పేరంటాలు జరిపి, పిల్లల్నిచ్చి ఆ వూరు ఈ వూరు తిప్పి, వుద్యోగంలో మెట్లు ఎక్కిస్తూ-కాలం-నన్ను హైదరాబాద్‌కు చేర్చింది. అదొక మజిలీ.

ఐదేళ్ళ క్రితం—

చాలా చిత్రంగా నేనూ, రఘుపతీ, ప్రకాశమూ తిరిగి కలుసు కున్నాం హైదరాబాద్‌లో.

రఘుపతి ఇన్సూరెన్సు కంపెనీలో ఆఫీసరుగా ఉన్నాడు. భార్యనీ, ఇద్దరు పిల్లల్ని పరిచయం చేశాడు.

ప్రకాశం వ్యాపార వేత్తగా స్థిరపడ్డాడు. చాలా కంపెనీలకి డైరెక్టరు. ఊళ్ళో సాంస్కృతిక సంఘాలకి పోషకుడు. పెళ్ళి చేసుకున్నాడు. భార్య ఎవరో పంచదార ఫాక్టరీ యజమాని కూతురు. పిల్లల్లేరు. సిరికి కొదవేముంది కనుక చిన్నప్పటిలానే మెరిసి పోతున్నాడు.

మా ముగ్గురి కుటుంబాలు చాలా సన్నిహితమై పోయాయి. రాక పోకల్తోనూ ఆత్మీయతతోనూ, మైత్రీ బంధంతోనూ-మరోసారి పూల నావలో తేలసాగేం మేము.

జంట నగరాల సాహితీ సంస్థ వాళ్ళు ఏవో సభలు జరుపుతూ నన్నూ వొకరోజు మాట్లాడమన్నారు. సరేనన్నాను.

ఆ రోజు సభకి ప్రభావతీ, పిల్లలూ వచ్చారు. రఘుపతీ కుటుంబంతో వచ్చాడు. ప్రకాశం భార్యా సమేతంగా వచ్చాడు.

ప్రసంగం అయిన తర్వాత-ప్రకాశం స్టేజీ మీదికి వచ్చాడు. నా గురించి చాలా గొప్పగా మాట్లాడేడు. నేను అతని మిత్రుణ్ణికావడం అతని అదృష్టమన్నాడు. కళ్ళు చెమరుస్తుండగా కళ్ళజోడు తీసి చేత్తో

పట్టుకుని, నాకు పూలదండ వేశాడు. కొత్త వస్త్రాలు కప్పేడు. పట్టుశాలువా కప్పేడు. నన్ను తన చేతుల్లోకి తీసుకుని గుండెలకి హత్తుకున్నాడు.

ప్రకాశం అభిమానానికి నేనూ చలించాను. అయితే కొంచెం ఇబ్బందిగా ఫీలయి, మొహమాటంలో పడ్డాడు.

మరో పదిరోజుల్లో మా రామం పుట్టినరోజు వచ్చింది. రఘుపతీ, ప్రకాశం కుటుంబ సభ్యులతో మా యింటికి వచ్చారు. యిల్లా వాకిలీ పండగ వాసనతో పరిమళించిపోయింది.

సాయంత్రం డాబామీద కూర్చున్నాం. నేనూ, రఘూ, ప్రకాశమూ. శైలజ పెళ్ళి ప్రసక్తి తెచ్చేను నేను. కట్నకానుకలు, నా తాహతు, వీటి మీదుగా సాగింది మా సంభాషణ. హఠాత్తుగా నా భుజం చరిచి అన్నాడు ప్రకాశం. డోన్ట్‌వర్రీ ప్రకాశం. నువ్వెక్కడున్నా సరే "శైలజ పెళ్ళి" అని కబురు చెయ్ పదివేలు పంపుతాను, సరేనా ? దాన్నిబట్టి కట్నం నిర్ణయించుకో, ఓకే?"

నేను తృప్తిగా వూపిరి పీల్చుకున్నాను.

మరో ఏడాదికి నేను తిరుపతికి బదిలీ అయ్యాను.

–ప్రకాశం హామీ గుర్తుకొచ్చింది. రఘుపతీ కొంత సర్దకపోడు. అందుకే-ప్రభతో ధైర్యంగా-'డబ్బు సంగతి ఆలోచిద్దాంలే పడుకో-' అనగలిగేను.

ప్రభకేసి చూసేను. ఆమెకు నిద్రపట్టినట్లు లేదు. మంచంలో మసలుతోంది. నేనులేచి లెటర్‌పాడ్ తీసుకున్నాను. లైటువేసి ప్రకాశంకు రఘుపతికీ ఉత్తరాలు రాయడం మొదలెట్టాను.

* * *

నా ఉత్తరానికి రఘుపతిజవాబు చూసుకుని నేను హైదరాబాద్ ప్రయాణమైనాను, ప్రకాశంను స్వయంగానే కలుసుకోవచ్చునే ఆలోచనతో.

"ఉన్నది ఒక్కగానొక్క ఆడపిల్ల - పైగా తెలిసిన సంబంధం కనుక - శ్రీధర్‌కిచ్చి చేసేయండి. కట్నం కోసం వెనుకంజ వేయడం భావ్యం కాదని నా అభిప్రాయం. అయినా నువ్వూ ఇరవై వేలు భరించలేనంత హీనస్థితిలో లేవు గదా - కాకుంటే ప్రస్తుతం అప్పు చేయాలి. అంతేగదా" అన్నాడు, రఘుపతి నా మనసులోని మాటల్ని అన్నిటినీ క్రోడీకరిస్తూ.

లేను అన్నట్లు తలవూపేను.

ఆ రాత్రికి అక్కడే వుంచారు రఘుపతీ, అతనిభార్య. ఉదయాన్నే ఐదువేలకి డ్రాఫ్టుని నా చేతిలో వుంచి అన్నాడు రఘుపతి-"ఇది తీసుకుని వెళ్ళిరా ప్రకాశంని కలుసుకోవద్దులే"

నేను గతుక్కుమన్నాను. "అదేం" అని ప్రశ్నించాను.

చాలా సేపు తటాపటాయించి చెప్పేడు "కొన్ని నిజాల్ని వినకపోవడంలోనే హాయి వుంటుంది మూర్తీ. ప్రకాశం మొన్న పనికట్టుకుని మా యింటికి వచ్చాడు. నువ్ హైదరాబాద్‌లో వుండగా నీతో అంత సన్నిహితంగా మెలగడంలోనూ, నీకు సన్మానాలు చెయ్యడంలోనూ, అడపాదడపా మీ పిల్లలకు బహుమతులందించడంలోనూ-అన్నిటి వెనుకా అతని స్వప్రయోజనముంది. నువ్ వాళ్ళకి అవసరమైన డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ వుండటం మాత్రమే-అతని దృష్టిలో నీ అర్హత. ఆఅర్హతని అతను 'ఎన్‌క్యాష్' చేసుకోగలిగినంత కాలం- నువ్వతనికి మిత్రుడివి. ఇప్పుడు ఇక్కడినుండి బదిలీ అయిపోయి నువ్వా అర్హతని కోల్పోయేవు. అంతే 'వేలూ లక్షలూ సమర్పించడానికి నా యిల్లేం సత్రం కాదు' అన్నాడు. నిజానికి నిన్నుచూడటం అతనికి ఇష్టంలేదు. ఆ పైన నీ యిష్టం"

రఘుపతి మాటల్ని నమ్మక తప్పదు. అయినా ప్రకాశం నిజ స్వరూ

పాన్ని నేనే తెలుసుకుంటే–

"థ్యాంక్స్" చెప్పి కదిలేను.

–రైల్లో కూర్చున్నాను. ప్రకాశం నవ్వు చెవుల్లో గింగురు మంటోంది. "ఏదో 'జోక్'గా పదివేలిస్తానంటే నిజమనుకుని నాదుంపతెంచుతావనుకోలేదురా మూర్తీ"-అన్న అతని మాటల్లా మారుమ్రోగుతున్నై.

దూరంగా స్పీకర్లో పాట వినిపిస్తోంది-'చుక్కలను కోసుకుని తెమ్మంటావా?' అని

అవును అది పల్లవిని తుంచిపారేసిన గీతం. మంటల్లోకి విసిరేసిన పూల పొట్లం.